వంతెన ఇంతేనా..

- శిలాఫలకానికే పరిమితమైన అమర్లబండ వంతెన నిర్మాణం
- వరదొస్తే రాకపోకల నిలిపివేత


అమర్లబండ వద్ద వంతెన నిర్మించాల్సిన ప్రదేశం

సదాశివనగర్(ఎల్లారెడ్డి) : సదాశివనగర్ నుంచి అమర్లబండ గ్రామానికి వెళ్లే దారిలో గ్రామానికి ముందే ఉండే అమర్లబండ వాగుపై వంతెన నిర్మించాలని ఏళ్లుగా గ్రామస్తులు కోరుతున్నప్పటికీ అధికారులు గాని, ప్రజాప్రతినిధులు గాని స్పందించిన దాఖలాలు లేవు. ప్రతి ఏడాది వర్షాకాలంలో ఈ వాగుపై నుంచి రాకపోకలు పూర్తిగా నిలిచిపోతాయి. దీంతో తాడ్వాయి మీదుగా నిజాంసాగర్, ఎల్లారెడ్డి వైపు వెళ్లాలనుకునే వారు 20 కి.మీ చుట్టూరా తిరిగి వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది.

ప్రతి ఎన్నికల సమయంలో అమర్లబండకు వచ్చే ప్రజాప్రతినిధులు తప్పనిసరిగా వాగుపైన వంతెన నిర్మిస్తామని హామీలు ఇస్తున్నప్పటికీ ఇప్పటికీ అది అమలుకు నోచుకోవట్లేదు. గ్రామస్తుల విజ్ఞాపన మేరకు బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే జాజాల సురేందర్ వంతెన నిర్మాణం కోసం ప్రత్యేక నిధులు మంజూరు చేయించి శంకుస్థాపన కూడా చేశారు. అంతలోనే అసెంబ్లీ ఎన్నికల కోడ్ అమల్లోకి రావడంతో ఎక్కడి పనులు అక్కడే నిలిచిపోయాయి. దీంతో గ్రామస్తుల ఆశలు అడియాశలుగా మారాయి.

వర్షాకాలం వస్తే నరకమే..

వర్షాకాలంలో వాగు పారుతున్నప్పుడు రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతోంది. గత వర్షాకాలంలో సాహసం చేసి ఓ నిండు గర్భిణిని ట్రాక్టర్‌పై ఎక్కించి వాగు దాటించి ఆస్పత్రికి తరలించిన సందర్భాలు ఉన్నాయి. వాగు అవతలివైపున ఉన్న రైతులు సైతం ఇలా ట్రాక్టర్‌పై నిలబడి ప్రాణాలను అరచేతిలో పెట్టుకుని వాగును దాటిన ఘటనలు ఉన్నాయి. ఎమ్మెల్యే మదన్‌మోహన్ రావు ప్రత్యేక దృష్టి సారిస్తే తమ సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తోందని గ్రామస్తులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

ఇబ్బందులు పడుతున్నాం



అమర్లబండ గ్రామానికి వెళ్లడానికి మధ్యలో ఉన్న వాగుపై వంతెన లేకపోవడం వల్ల చాలా ఇబ్బందులు పడుతున్నాం. వాగు దగ్గర పనుల నిర్మాణం కోసం శిలాఫలకం ఏర్పాటు చేశారు. కోడ్ అమల్లోకి రావడంతో పనులు నిలిచిపోయాయి. త్వరగా పనులు చేపట్టాలి

– ఎర్రోల్ల రాజయ్య, అమర్లబండ

పనులు పూర్తి చేయాలి



వంతెన నిర్మాణ పనులు వెంటనే పూర్తి చేసి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలి. సుమారు 50 ఏళ్ల నుంచి వాగు పారుతున్నప్పుడల్లా ఇబ్బందులు పడుతున్నాం. ప్రస్తుత ఎమ్మెల్యే మదన్ మోహన్ రావు వంతెన నిర్మాణం కోసం ప్రత్యేక దృష్టి సారించి పనులు పూర్తి అయ్యేలా చూడాలి.

– పల్లె రాజేశ్వర్ రావు, మాజీ సర్పంచ్, అమర్లబండ

కాంగ్రెస్ నాయకుల నిరసన


నిరసన తెలుపుతున్న కాంగ్రెస్ నాయకులు

కామారెడ్డి టౌన్ : ఏఐసీసీ అగ్రనేత రాహుల్ గాంధీపై అనుచిత వ్యాఖ్యలు చేసినందుకు కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో గురువారం జిల్లా కేంద్రంలో నిరసన తెలిపారు. బీజేపీ నేతల చిత్రపటాలను దహనం చేశారు. యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు శ్రీనివాస్ మాట్లాడుతూ రాహుల్‌గాంధీపై అనుచిత వాఖ్యలు చేసిన బీజేపీ నేతలను తక్షణమే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. బీబీపేట, దోమకొండ మండలాల అధ్యక్షుడు మహేశ్ శ్రీనివాస్, నాయకులు యూనిస్, రఫీక్ తదితరులున్నారు.

రాహుల్‌గాంధీని విమర్శిస్తే ఊరుకోం

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి) : కాంగ్రెస్ నేత రాహుల్‌గాంధీని బీజేపీ నాయకులు విమర్శిస్తే ఊరుకునేది లేదని నాగిరెడ్డిపేట మండల కాంగ్రెస్ నాయకులు పేర్కొన్నారు. కాంగ్రెస్ క్రమశిక్షణ సంఘం సభ్యులు రాంచందర్‌రెడ్డి, తాండూర్ సొసైటీ చైర్మన్ గంగారెడ్డి, కాంగ్రెస్ మండల ప్రధాన కార్యదర్శి కిష్టయ్య తదితరులున్నారు.

బీటీ రోడ్డు పనులతో హర్షం



మద్నూర్(జుక్కల్) : మండల కేంద్రంలోని సబ్‌స్టేషన్ నుంచి కొత్త బస్టాండ్ వరకు ప్రధాన రహదారి పూర్తిగా దెబ్బతినడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతరావు బీటీ రోడ్డు నిర్మాణం కోసం రూ.7.50 కోట్లు మంజూరు చేసి పనులు ప్రారంభింపజేశారు.

పాఠశాల గదుల్లో అపరిశుభ్రత

ఎల్లారెడ్డి: మండలంలోని మల్లయ్యపల్లి గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలోని తరగతి గదులను అపరిశుభ్రం చేస్తున్న వ్యక్తులపై తగిన చర్యలు తీసుకోవాలని పాఠశాల సిబ్బంది కోరుతున్నారు. పాఠశాల వెనక భాగంలోని విరిగిన కిటికీ నుంచి తరుచూ గుర్తు తెలియని వ్యక్తులు తరగతి గదిలో మూత్ర విసర్జన చేస్తున్నారని, గదుల్లో దుర్గంధం వస్తోందని విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. తరగతి గదులను అపరిశుభ్రం చేస్తున్న వారిని గుర్తించి వారిపై తగిన చర్యలు తీసుకునేలా చూడాలని సిబ్బంది కోరుతున్నారు.

స్కూల్ ఎదుట ఆందోళన


స్కూల్‌ఎదుట నిరసన తెలుపుతున్న తల్లిదండ్రులు

కామారెడ్డి టౌన్ : జిల్లా కేంద్రంలోని నిజాంసాగర్ రోడ్‌లోని ఓ ప్రైవేట్ స్కూల్ ఎదుట గురువారం విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళనకు దిగారు. రెండో ఇన్‌స్టాల్మెంట్ ఫీజు కట్టలేదని స్కూల్ యాజమాన్యం కొందరు విద్యార్థులను పరీక్షకు అనుమతి ఇవ్వకపోవడంతో పాటు ఫీజు కట్టాలని విద్యార్థులతో తల్లిదండ్రులకు సమచారం ఇప్పించారు. ఈ మేరకు తల్లిదండ్రులు స్కూల్‌కు వచ్చి ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులతో వాగ్వాదానికి దిగారు. రెండు, మూడురోజుల్లో ఫీజులు కడతామని చెప్పినప్పటికీ విద్యార్థులను పరీక్షలకు అనుమతివ్వలేదని పేర్కొంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. తిరిగి పరీక్షకు అనుమతిస్తామని స్కూల్ యాజమాన్యం తెలపడంతో తల్లిదండ్రులు శాంతించారు.

బోరు మోటారు ప్రారంభం



కామారెడ్డి టౌన్ : మున్సిపల్ పరిధిలోని 9వ వార్డు లింగాపూర్‌లో నూతన బోరు మోటారును మున్సిపల్ చైర్‌పర్సన్ గడ్డం ఇందుప్రియ గురువారం ప్రారంభించారు. చైర్‌పర్సన్‌ను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్ పడిగే సుగుణ, పాత శివ కృష్ణమూర్తి తదితరులున్నారు.

మహాలక్ష్మి సర్టిఫికెట్ల పంపిణీ



భిక్కనూరు : మండలంలోని ఇసన్నపల్లి గ్రామంలో లబ్ధిదారులైన మహిళలకు మహాలక్ష్మి సర్టిఫికెట్లను గురువారం పంపిణీ చేశారు. కాంగ్రెస్‌హామీ మేరకు మహిళలకు సిలిండర్లను అందజేస్తుందని కాంగ్రెస్ ఓబీసీ మండలాధ్యక్షుడు వడ్ల తిర్మల్‌స్వామి అన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నేతలు నారాయణ, రాములు, ఇంద్రగౌడ్, సత్తయ్య స్వామి బాబు, పోచయ్య పాల్గొన్నారు.

లోక్ అదాలత్‌ను వినియోగించుకోవాలి

ఎల్లారెడ్డి : ఈనెల 28న జరిగే లోక్ అదాలత్ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎస్సై మహేశ్ అన్నారు. లోక్ అదాలత్ ద్వారా వివాహ, చిట్‌ఫండ్స్, సివిల్, క్రిమినల్ కేసులలో రాజీ చేసుకోదగ్గ వాటిని పరిష్కరించుకోవాలని సూచించారు.

అంబేడ్కర్ ఆశయ సాధనకు కృషి చేయాలి



ఎల్లారెడ్డిరూరల్(ఎల్లారెడ్డి) : అంబేడ్కర్ ఆశయ సాధనకు ప్రతిఒక్కరు కృషి చేయాలని ఆల్ ఇండియా అంబేడ్కర్ సంఘం జిల్లా కార్యదర్శి ప్రభాకర్ అన్నారు. ఎమ్మార్పీఎస్ నాయకులు పద్మారావు తదితరులున్నారు.

బాధిత కుటుంబానికి స్నేహితుల అండ

రామారెడ్డి : రామారెడ్డి గ్రామానికి చెందిన జాజుకోరు బుచ్చయ్య ఆర్థిక సమస్యలతో మృతి చెందాడు. బాధిత కుటుంబానికి రామారెడ్డి కాంగ్రెస్ పార్టీ నుండి రూ. 10వేల ఆర్థికసాయం, రామారెడ్డి గ్రామానికి చెందిన ఉదయం వాకర్స్ 5.30 బ్యాచ్ ఆధ్వర్యంలో బాధిత కుటుంబానికి రూ.5 వేల సాయం అందజేశారు. కార్యక్రమంలో మండల కమిటీ నాయకులు ప్రవీణ్ గౌడ్, తూర్పు రాజు, తూర్పు సుబ్బయ్య, వైస్ చైర్మన్ అమ్ముల పశుపతి,బీబీపేట రంజీత్, 5.30 బ్యాచ్ సభ్యులు గురిజకుంట స్వామి, పడిగెల శ్రీనివాస్ పాల్గొన్నారు.

గ్రామాల్లో కిసాన్ సంఘ్ కమిటీలు



లింగంపేట(ఎల్లారెడ్డి) : మండలంలోని లింగంపల్లి, సురాయిపల్లిలో గురువారం భారతీయ కిసాన్ సంఘ్ గ్రామ కమిటీలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. లింగంపల్లి అధ్యక్షుడు చౌడం నారాయణ, ఉపాధ్యక్షుడు చాకలి అంజయ్య, ప్రధాన కార్యదర్శి గాలెం హరీష్, 8 మంది సభ్యులను ఎన్నుకున్నారు. సురాయిపల్లి గ్రామ కమిటీ అధ్యక్షుడు కాంత్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు కోల పెద్ద రాజు, ప్రధాన కార్యదర్శి రమావత్ జీల్యా, సలహాదారు రాజశేఖర్‌రెడ్డి, 6 మంది సభ్యులను ఎన్నుకున్నారు.

పార్టీని పటిష్టం చేయాలి


నాగిరెడ్డిపేటలో మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి) : క్షేత్రస్థాయిలో కాంగ్రెస్ పార్టీని పటిష్ట పర్చేందుకు కృషి చేయాలని నాగిరెడ్డిపేట మండల కాంగ్రెస్ నాయకులు సూచించారు. నాగిరెడ్డిపేట మండలంలోని మాటూర్, అక్కంపల్లి, తాండూర్, వెంకంపల్లి గ్రామాల్లో గురువారం కాంగ్రెస్ కార్యకర్తలతో వారు సమావేశం నిర్వహించారు. కాంగ్రెస్ మండల ప్రధాన కార్యదర్శి కిష్టయ్య, క్రమశిక్షణసంఘం సభ్యులు రాంచందర్ రెడ్డి, తాండూర్ సొసైటీ చైర్మన్ గంగారెడ్డి తదితరులున్నారు.

లింగంపేటలో..

లింగంపేట(ఎల్లారెడ్డి) : గ్రామాల్లో కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి ప్రతీ ఒక్కరూ కృషి చేయాల మండల పార్టీ అధ్యక్షుడు బుర్ర నారాగౌడ్ సూచించారు. గురువారం ఆయన లింగంపేట మండలం శెట్పల్లి సంగారెడ్డి గ్రామంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు మోహిద్, ఎల్లమయ్య, అశోక్, అంజయ్య తదితరులున్నారు.

తాడ్వాయిలో..

తాడ్వాయి(ఎల్లారెడ్డి) : కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో ఉండి పార్టీని మరింత బలోపేతం చేయడానికి కృషిచేయాలని పార్టీ మండల అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి అన్నారు. తాడ్వాయి మండలంలోని దేమికలాన్, సందివాడ గ్రామాలలో గురువారం కాంగ్రెస్ పార్టీ మండల స్థాయి నాయకులు, కార్యకర్తల సమావేశాన్ని నిర్వహించారు.నాయకులు ఏఎంసీవైస్‌చైర్మన్ రాజిరెడ్డి, షౌకత్ అలీ తదితరులున్నారు.

ఎల్లారెడ్డిలో..

ఎల్లారెడ్డిరూరల్(ఎల్లారెడ్డి): స్థానిక సంస్థలలో కాంగ్రెస్ పార్టీ సత్తా చాటాలని మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సాయిబాబా, మాజీ మున్సిపల్ చైర్మెన్, కౌన్సిలర్ కుడుముల సత్యనారాయణ అన్నారు. గురువారం మండలంలోని మల్కాపూర్ గ్రామంలో కాంగ్రెస్ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు వెంకట్రాం రెడ్డి, సామెల్ తదితరులున్నారు.

మండల పరిషత్‌లో స్వచ్ఛదనం-పచ్చదనం



తాడ్వాయి(ఎల్లారెడ్డి) : మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయం, తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో గురువారం స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమాన్ని నిర్వహించారు. చెత్తచెదారం, పిచ్చి మొక్కలను తొలగించి శుభ్రం చేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో సయ్యద్ సాజిద్, తహసీల్దార్ రహిమొద్దీన్, ఎంపీవో సవితారెడ్డి, ఏపీవో మల్లేశ్, ఏపీఎం రవీందర్ తదితరులున్నారు.

రుణమాఫీ కాని రైతుల వివరాల సేకరణ



లింగంపేట(ఎల్లారెడ్డి) : మండలంలోని బాయంపల్లిలో గురువారం మండల వ్యవసాయాధికారి అనిల్‌కుమార్ రుణమాఫీ కాని రైతుల వివరాలు సేకరించారు. ఇప్పటికే ఆయా గ్రామాల్లో ఏఈవోలు సర్వే చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ బాలయ్య, మాజీ ఎంపీటీసీ పచ్చంటి సాయిలు, అంజయ్య, సాయిరాం, ఏఈవో పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు ఘన స్వాగతం



ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావును సన్మానిస్తున్న కాంగ్రెస్ నాయకులు, ఫైర్‌గన్స్‌తో ఎమ్మెల్యే

నిజాంసాగర్(జుక్కల్) : విదేశీ పర్యటన దిగ్విజయంగా ముగించుకొని గురువారం జుక్కల్ నియోజకవర్గానికి వచ్చిన స్థానిక ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావుకు కాంగ్రెస్ శ్రేణులు ఘన స్వాగతం పలికారు. మండలంలోని నర్సింగ్‌రావ్‌పల్లి చౌరస్తా వద్ద సంగారెడ్డి- నాందేడ్ జాతీయ రహదారిపై గజమాలలతో సన్మానం చేశారు. అక్కడి నుంచి జుక్కల్ ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయానికి భారీ కాన్వాయ్‌తో తరలి వెళ్లారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు జయప్రదీప్, మల్లికార్జున్, రవీందర్‌రెడ్డి, నాగబూషణం గౌడ్ తదితరులున్నారు.

భక్తిశ్రద్ధలతో గణేశ్ నిమజ్జనం


దోమకొండలో శోభాయాత్రలో పాల్గొన్న భక్తులు

జిల్లాలో గణేశ్ నిమజ్జన శోభాయాత్రను గురువారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. యువతీ యువకులు ఉత్సాహంగా పాల్గొన్నారు.


చిన్నమల్లారెడ్డిలో నవభారత్ యూత్ ఆధ్వర్యంలో..


అడ్లూర్ ఎల్లారెడ్డిలో..


పిట్లంలో లడ్డూను దక్కించుకున్న అర్వింద్



పాత బాన్సువాడలో నిమజ్జనానికి తరలుతున్న వినాయక విగ్రహాలు

క్లుప్తంగా

సాగులో మెలకువలు పాటించాలి



తాడ్వాయి(ఎల్లారెడ్డి) : పంటల సాగులో రైతులు మెలకువలు పాటించాలని ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ శాస్త్రవేత్తలు అనిల్ రెడ్డి, రేవంత్ అన్నారు. మండలంలోని ఎర్రాపహాడ్ శివారులోని సోయపంట, మొక్కజొన్న పంటలను పరిశీలించారు. కార్యక్రమంలో వ్యవసాయ కళాశాల విద్యార్థులు, రైతులు విఠల్‌రెడ్డి, మోహన్‌రెడ్డి తదితరులున్నారు.

పిట్లం జీపీ తనిఖీ



పిట్లం(జుక్కల్) : పిట్లం జీపీ కార్యాలయాన్ని గురువారం స్పెషల్ ఆఫీసర్, ఎంపీడీవో కమలాకర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. పంచాయితీ పరిధిలో అభివృద్ధి పనుల విషయమై కార్యదర్శి యాదగిరికి సూచనలు చేశారు. జీపీ సిబ్బంది మనోజ్, సుభాష్, తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన ఉండాలి



పెద్దకొడప్‌గల్(జుక్కల్) : సైబర్ నేరాలపై ప్రతి ఒక్కరికీ అవగాహన ఉండాలని ఆర్థిక అక్షరాస్యత స్వచ్ఛంద సేవా సంస్థ సభ్యులు పేర్కొన్నారు. గురువారం మండలంలోని పోచారంలో ఆర్థిక అక్షరాస్యత కేంద్రం బిచ్కుంద స్వచ్ఛంద సేవా సంస్థ, సొసైటీ ఫర్ సోషల్ ట్రాన్స్‌ఫార్మేషన్ ఆధ్వర్యంలో బ్యాంకుల పైన ప్రజలకు అవగాహన కల్పించారు. కౌన్సిలర్ ముఖేష్,రవికుమార్, రవీందర్ పాల్గొన్నారు.

ప్రభుత్వ కళాశాలకు కుర్చీల అందజేత

దోమకొండ : దోమకొండ మండలంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలకు అదే కళాశాలలో పనిచేస్తున్న ఫిజిక్స్ లెక్చరర్ ఎం నర్సింహారాజు ఆయన తల్లి దివంగత మంగలపల్లి చంద్రభాగవ్వ జ్ఞాపకార్థం 12 కుర్చీలను గురువారం కళాశాల ప్రిన్సిపాల్ జి శంకర్‌కు అందజేశారు. కళాశాల అధ్యాపకులు వసంత్, భాస్కర్, శేషారావు తదితరులు పాల్గొన్నారు.

పీఆర్‌టీయూ రాష్ట్ర కార్యదర్శిగా గిర్మబోయి



కామారెడ్డి అర్బన్ : పీఆర్‌టీయూ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శిగా తాడ్వాయి మండలం కృష్ణాజీవాడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుడు జి.గిర్మబోయిని నియమించినట్లు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు అంభీర్ మనోహర్‌రావు, జే.లక్ష్మీనారాయణ తెలిపారు.

విద్యార్థులకు సైకిళ్లు, పుస్తకాల అందజేత



రాజంపేట : రాజంపేట మండలంలోని తలమడ్ల గ్రామ ఉన్నత పాఠశాలలో పేద బలహీన వర్గాలకు చెందిన విద్యార్థులకు గురువారం సైకిళ్లు, నోటు పుస్తకాలను అందజేశారు. హైదరాబాద్‌కు చెందిన కనిగిరి కళ్యాణ చక్రవర్తి ఆయన సతీమణి కనిగిరి సౌమ్య తల్లిదండ్రులు రామ స్వామి, సత్యనారాయణ జ్ఞాపకార్థం రూ. 30 వేల నాలుగు సైకిళ్లు, రూ. 500 విలువైన పుస్తకాలను అందజేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం దొమ్మాట భిక్షపతి, ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయ బృందం విద్యార్థులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ భూతాన్ని తరిమేద్దాం



మాచారెడ్డి : మాచారెడ్డి ఎన్ఎస్ఎస్ యూనిట్-1, 2 ఆధ్వర్యంలో స్వచ్ఛత హీ సేవ కార్యక్రమంలో భాగంగా గురువారం మండల కేంద్రంలో ర్యాలీ నిర్వహించారు. ప్లాస్టిక్ భూతాన్ని తరిమేద్దాం పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుదాం అంటూ నినాదాలు చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ యాకునుద్దీన్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారులు తిరుపతి గౌడ్, రామకష్టారెడ్డి తదితరులున్నారు.

సంక్షిప్తం

కుప్రియాల్‌లో గణేశ్ లడ్డూ వేలం

సదాశివనగర్(ఎల్లారెడ్డి) : మండలంలోని కుప్రియాల్ గ్రామంలో శివాజీ యువసేన ఆధ్వర్యంలో నెలకొల్పిన గణేశ్ లడ్డూ వేలంలో రూ. 36,911కు ఉప్పు సత్యనారాయణ దక్కించుకున్నాడు. ఈ కార్యక్రమంలో యువసేన యూత్ సభ్యులు అశృత్ గౌడ్, రోహన్ రెడ్డి, కోమల్ గౌడ్, శ్రీకాంత్‌రెడ్డి, సుజిత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మహమ్మద్ ప్రవక్త జన్మదిన వేడుకలు

లింగంపేట(ఎల్లారెడ్డి) : మండల కేంద్రంలో గురువారం మైనారిటీలు మహమ్మద్ ప్రవక్త జన్మదినం మిలాద్-ఉన్-నబీ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ప్రధాన వీధుల గుండా ర్యాలీ తీశారు. ఎల్లారెడ్డి సీఐ రవీందర్, ఎస్సై అరుణ్ కుమార్ బందోబస్తు నిర్వహించారు.

బీడీ స్కాలర్‌షిప్‌ల దరఖాస్తుకు గడువు పెంపు

కామారెడ్డి టౌన్ : ఒకటి నుంచి 10వ తరగతి వరకు చదివే బీడీ కార్మికుల పిల్లలు ఉపకార వేతనాలకు దరఖాస్తు చేసుకునేందుకు తుది గడువును ఈనెల 30వ తేదీ వరకు కేంద్ర ప్రభుత్వం పెంచిందని కామారెడ్డి బీడీ కార్మికుల సంక్షేమ ఆస్పత్రి వైద్యాధికారి డాక్టర్ శృతి జీవన్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 0120-6619540 హెల్ప్‌లైన్‌కు లేదా జిల్లా కేంద్రంలోని హౌజింగ్‌బోర్డు కాలనీలో బీడీ కార్మికుల ప్రభుత్వ ఆస్పత్రిలో సంప్రదించాలన్నారు.

నూతన కార్యవర్గం ఎన్నిక

బీబీపేట : మండల కేంద్రంలోని జామ మజీద్‌లో జమతే ఉలేమా ఐ హింద్ జిల్లా సెక్రటరీ హాఫీస్ యూసుఫ్ సహబ్ హఫీజ్ తఖీ అధ్యక్షతన జమతే ఉలేమా ఐ హింద్ మండల కమిటీని గురువారం ఎన్నుకున్నారు. బీబీపేట్ మండల అధ్యక్షుడిగా మహమ్మద్ ఆసిఫ్, జనరల్ సెక్రెటరీగా షేక్ హుస్సేన్, మండల ఉపాధ్యక్షులుగా సయ్యద్ హుస్సేన్, మహమ్మద్ గౌస్ క్యాషియర్‌గా మహమ్మద్ ఇమ్రాన్, సభ్యులుగా బాబా ఫక్రుద్దీన్, షేక్ అహ్మద్ సయ్యద్ తదితరులు ఎన్నికయ్యారు.

గొర్రె, మేకలకు టీకాలు

భిక్కనూరు : మండలంలోని బస్వాపూర్ గ్రామంలో గొర్రె, మేకలకు వ్యాధి నిరోధక టీకాలను పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో గురువారం వేశారు. జిల్లా పశు సంవర్ధక శాఖాధికారి రాజేశ్వర్ మాట్లాడుతూ రైతులు గొర్రెల మేకల యజమానులు తమ పశువులను భారత్ పశుధాన్ ఆప్‌లో నమోదు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో మండల పశువైద్యాధికారి దేవేందర్, భరత్‌కుమార్ తదితరులున్నారు.

విద్యార్థులకు కంటి పరీక్షలు



బీబీపేట: మండలంలోని జనగామ గ్రామ ప్రాథమికోన్నత పాఠశాలలోని విద్యార్థులకు గురువారం ఉచితంగా కంటి పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా డా రవీందర్ 120 మంది విద్యార్థులకు ఒక్కొక్కరిగా కంటి పరీక్షలు నిర్వహించి వారిలోని లోపాలను గుర్తించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం ప్రవీణ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రెండోరోజు విరాళాల సేకరణ

కామారెడ్డి టౌన్ : ఖమ్మం జిల్లా వరద బాధితుల కోసం తెలంగాణ నిరుద్యోగుల కళాకారుల సంఘం ఆధ్వర్యంలో గురువారం రెండో రోజు జిల్లా కేంద్రంలో విరాళాల సేకరణ కార్యక్రమం చేపట్టారు.